# హిమబిందు

తటవర్తి



డాక్టరు రాజశేఖరంతో హిమబిందు పరిచయం విచిత్రంగా జరిగింది. ఆ గ్రామానికి అతనువచ్చి ఏడాది కావస్తున్నా పేరు వినటమేకాని ఆమె ఎప్పుడూ ఎదుటుపడి ఎరుగదు! ఆ అవసరమూ లేకపోయింది.

మొదటిసారిగా ఆవేళ బాబును తీసుకొని ఊరికి ప్రక్కగా ఉన్న పెద్ద చెఱువుగట్టుకు వ్యాహాళిగా వెళ్ళింది హిమబిందు. చెరువులోని తామర పూవులు, తామరాకులు - వాటిపై ముత్యాల్లా నీటిబిందువులు ఆకర్షించాయి బాబుని.

నాలుగేళ్ళ బాబుకి నలభై రకాల ఊహాలు! వాడి చిన్నారి చేతినుంచి గులకరాళ్ళు నీటిలో కురికి కితకితలు పెడుతూ చిరుకెరటాలను తెరలు తెరలుగా లేవుతున్నాయ్. వాడి

కబుర్లకు ఊ కొడుతూనే తన ఆలోచనల్లో పడిపోయింది ఆమె.

గత విషాద చరిత్ర గుర్తుకువచ్చి మనస్సంతా వికలమై పోయింది. తండ్రి ఎవరో చెప్పుకోలేని ఈ పసివాని బ్రతుక్కికవిలువుందా? రేపు తోటిపిల్లలు అడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పలేక చిన్నబుచ్చుకునే ఆ పసివాడిని ఎలా బుజ్జగించాలి? ఏమని చెప్పాలి? భవిష్యత్తు ఎలా ఉంటుందో?—

బాహ్య స్మృతిలేని హిమబిందు బాబు ఎప్పుడు నీళ్ళవరకు వెళ్ళాడో గుర్తించలేదు. నీటిలోకి చొచ్చుకుపోయిన రావిచెట్టు వ్రేళ్ళు-వాటి మధ్య ఇరుక్కున్న తామరాకు - ఆ తామరాకుమీద పిల్లగాలికి ముచ్చటగా కదులుతున్న మూడు నీటి ముత్యాలు-వాడి నాకర్షించి ఆ ఆకునందుకోవడానికి ప్రోత్సహించాయి. చిరుచేయి రావివేరుమీద పట్టు తప్పింది. కాలుజారింది...

"అమ్మా!" అన్నకేక, బుడుంగుమన్న శబ్దము ఒక్కసారిగా ఆమెను మేల్కొల్పాయి. ఇది చూసి దూరాన పాలికాపు ఎవరో పొలికేక పెట్టాడు.

మరుక్షణంలో నిలువులోతు నీళ్ళల్లోకి దుమకబోయింది ఆమె.

మెరుపు మెరిసినట్లుగా ఎవరో బలంగా తనచేయి పట్టుకు వెనక్కి లాగటం, ఆ వెంటనే నీటిలో దుమికి ఒక్క మునుగులో బాబు జుట్టుపట్టుకొని పైకి రావటం జరిగిపోయింది.

ప్యాంటు, షర్టు, టై ధరించిన ఆ వ్యక్తి ఆ సమయంలో అక్కడికి రావటం, అంత సాహసం చేయటం ఆమె నాశ్చర్య పరచింది. పాలెకాపు సంబోధనతో అతడే డాక్టర్ రాజశేఖరం అని ఆమె గ్రహించింది. హాస్పిటల్ నుంచి ఆ వేళప్పుడు రోజూ తన బంగళాకు ఆ చెరువు గట్టు మీదుగా వెడుతూంటాడు అతను—విధిని మార్చడానికి ఒక్క క్షణం చాలు!

బాబుని నీటిగండంనుంచి కాపాడినరాజశేఖరం హాస్పిటలుకుతీసుకు వెళ్ళి చికిత్స చేశాడు. అరగంటలో వాడికి తెలివి వచ్చింది. కళ్ళతోనే కృతజ్ఞత తెలిపింది హిమబిందు.

"మీ పేరు చెప్పారుకాదు..." అతని ముఖంపై మందహాసం... తడిసిన ఉంగరాల ముంగురుల మెరుపులు—అతనిలో ఒక ఆకర్షణ వుంది!

"హిమబిందు."

"నీ అందమైన ముఖమే చెప్తోంది" అతని కళ్ళు మాట్లాడాయి.

సిగ్గుతో మరింత ఎర్రబడింది ఆమె ముఖపద్మం. "మీ మేలు ఎప్పటికీ మరువలేము. మా ఇద్దరి ప్రాణాలు కాపాడారు..."

"అది నా విధి. తోటివాళ్ళకి మాత్రం సహాయం చేయడం గొప్ప తనమేమీకాదు."

'ఉహుఁ! ఇది ప్రాణదానం. అన్నిటిలోకి అతిగొప్పది.'

'కాదు. నాకు ఈత వచ్చును. కాబట్టే ఆపని చేశాను. ఇంతకంటె గొప్పవి ఇంకా ఉన్నాయి.

అతనికి పొగడ్తలు గిట్టవని ఆమెకు అర్థమైంది. '...ఇంటివద్ద అమ్మ, అక్కయ్య ఎదురు చూస్తుంటారు. ఇక సెలవు తీసుకుంటాను.'

* * *

ఈ విధంగా పరిచయస్తులై రోజూ సాయంత్రం చెరువుగట్టువద్ద కలుస్తూండటం పరిపాటయి పోయింది వారికి.

జీవిత మిందుకనే విచిత్ర సంపుటమైనది! ఒక్కో చిన్న సంఘటనే జీవనగతిని మార్చి వేస్తుంటుంది!

ఈ పరిచయంతో తన మనస్సు ఆమె వైపాకర్షించిందని గుర్తించాడు రాజశేఖరం! ఆమె ఏ కారణం చేతనయినా ఒకనాడు రాకపోయితే, ఆ వేళల్లా ఏదో పోగొట్టుకున్న వాడిలా మధన పడేవాడు. ఆ మరునాడు ఆమె దర్శనంతో మనస్సు పులకించి పరువెత్తేది.

వరుసగా రెండురోజులు రాలేదు హిమబిందు. అతని మనస్సు మనస్సులో లేదు. ఆమె ఇంటికి వెళ్ళి చూడాలనిపించింది. కాని ఎలా? ఇల్లు తెలియదు. పోనీ వాకబు చేసుకొని వెళ్ళినా ఏంపని ఉందని వెళ్ళగలడు? మధన పడుతూఉన్న అతనికి మూడోనాడు ఆమె దర్శనమైంది.

ఎదురు చూసి చూసి పొందిన అనుభవం ఎప్పుడూ అతిమధురంగా, ప్రియాతిప్రియంగా ఉంటుంది!

ఈనాడు ప్రపంచంలోని సౌందర్యాన్నంతా తనలోనే ఇముడ్చుకు వచ్చినట్లుగా కనిపించింది హిమబిందు. ఒక్కసారిగా ఆమెను తన బాహువులమధ్య దాచుకోవా లనుకున్నాడు. కాని, ఇంకా అంత చనువేది? తన మనస్సు గ్రహిస్తున్నట్లుండే ఆమె కళ్ళు తననింకా ఎందుకు పరీక్షిస్తున్నాయి? 'ఈ వేళ ఏమయినాసరే ఆమె నడిగి వేయా' లనుకున్నాడు రాజశేఖరం.

చిరునవ్వుతో బాబు పలకరించాడు అతన్ని. వాడిని హిమబిందు చేతులనుంచి అందుకున్నాడు శేఖరం. కొంతసేపు వాడి కబుర్లు సాగాయి.

అతని ప్రశ్న ముందే గ్రహించి, '...మొన్న అక్కయ్యకు జ్వరం తగిలింది. అందుకని రాలేదు' అంది ఆమె.

'అరే, ఎవరినయినా మందుకు పంపకపోయేరా? లేకపోతే హాస్పటలుకు తీసుకు రాకపోయారా?'

'తనే కదలనిచ్చింది కాదు. తగ్గిపోయిందిలెండి. ఈ వేళే పథ్యం పెట్టాము.'

'మీరే మనుకోనంటే ఓ మాటడగనా?'

'నేనేమీ అనుకోనని మీకు తెలియదూ?'

'తెలుసు. కనుకనే మీ స్వంత విషయాలడిగే సాహసంచేస్తున్నాను. మీ అక్కయ్యను ఎప్పుడూ తీసుకు రారేం? ...'

'అక్కయ్యనా? అంత అదృష్టమా!' ఆమె ముఖం వెలవెల బోయింది. నీళ్ళు నిండిన ఆమె కళ్ళు చూసి అతను చలించిపోయాడు.

'క్షమించండి— తప్పుగా అడిగితే!'

'లేదు ... లేదు. మీ సహృదయాన్ని భరించగల నిర్మల జీవితాలు కావు మావి.'

'నా కర్థంకావటంలేదు.'

'అక్కయ్యవితంతువు. పెళ్ళయిన నెలరోజులకే భర్తని కోల్పోయిన నిర్భాగ్యురాలు.'

'అది ఆమె అపరాధం కాదు. ఆమెకు జీవితంపై మమకారం పెంచ వలసిన బాధ్యత మీపై ఉంది.'

'అవును అదే నేను ప్రయత్నిస్తున్నది. ఎప్పటికయినా మా జీవితాల్లో వెలుగు తొంగిచూస్తుందా? కడుపు నిండుగా నవ్వుకోగలమా? ఏమో! ...' తనలోతాను అనుకున్నట్లుగా అన్నది, ఆమె నేలపై చేతికందిన పుడకతో పిచ్చిగీతలుగీస్తూ.

'అంత నిరాశగా మాట్లాడవద్దు. నా సహాయం మీకు ఎప్పుడూ ఉంటుంది! ఎందుకో మీతో పరిచయమైనప్పటినుంచి మీరు నాకెంతో దగ్గరయినట్లు-నా కాత్మీయులైనట్లు ...'

బిత్తరగా చూసింది ఆమె.

'... అవును బిందూ! ఈ భావన ఎలా కలుగుతోందో చెప్పలేను. రెండురోజులుగా మీరు రాకపోతే

> 'మీ మొహం ఇదివర కెక్కడో చూసినట్టుందండీ!'
>
> 'నా దగ్గిరే చూసుంటారు!'

నేనేదో పోగొట్టుకున్నట్లు ఫీలయ్యాను. ఇప్పుడు నాకెంత తేలిగ్గా, హాయిగా ఉందో ... నా ముఖం చెప్పడంలేదూ?' అతని మధుర మందహాసాలతో ఆమె మనస్సు, తనూలత, పులకించాయి.

'నాకూ అలాగే అనిపిస్తోంది' అని అందామనివుంది. పెదవులు వణికాయి. మనోవ్యథ గొంతు పెగల నివ్వలేదు ఆమెని.

'మనస్సులోని మాట ఎంత కాలమని దాగుతుంది? మీ మనస్సు నాకు తెలుసు బిందూ!'

'... అబ్బ, అలా పిలవకండి' ఆమె కంఠం వణికింది.

అతను తెల్లబోయాడు. 'ఏం? అలా పిలిచే హక్కు లేకపోయినా, అర్హత నాకు లేదా?'

'అది కాదు. అదికాదు ... పిలిపించుకునే అర్హతే నాకు లేదు.'

"ఛ! ఎందుకీ కన్నీరు..." తన చేరుమాలుతో ఆమె బుగ్గలు వొత్తాడు శేఖరం.

"అందమైన కనులున్నది నవ్వి నవ్వించడానికి కాని, కన్నీరు కురిపించ టానికి కాదు. మంచి మనసున్నది మమతలతో మాధురీమయం చేసుకో టానికి కాని వేదనాగ్నిరగిలించటానికి కాదు."

కొంతసేపటికి తేరుకున్న హిమ బిందు సాలోచనగా అన్నది "ఈ స్నేహమిలా నిలిచిపోతే ఎంత బాగుంటుంది?"

"ఎందుకు నిలవదు? మీ మన స్సులా, మీ సౌందర్యంలా, మీ పేరులా ఈ స్నేహం ఎప్పుడూ స్వచ్ఛంగా నిర్మలంగా ఉంటుంది. ఇది ముమ్మాటికీ నిజం!" ధృడంగా ఉన్నది అతనిగొంతు.

తల అడ్డంగా త్రిప్పింది ఆమె. "అంతటి ఆరాధనకి నేను నోచు కోలేదు."

"ఏం? ఎందుకని?"

ఒక్కక్షణం ఆగి రెండు గజాల దూరంలో ఆడుకుంటున్న బాబును చూపిస్తూ, "వాడెవరో తెలుసా? మీకు తెలియదు... వాడు....వాడు, నా కొడుకు. నా పాపానికి ఫలితం!" అంటూ దోసిట్లో ముఖం దాచు కుంటూ వెక్కి వెక్కి ఏడువసాగింది హిమబిందు.

కొరడాదెబ్బ తిన్నవాడిలా ఉలిక్కిపడ్డాడు శేఖరం! కడుపులో ఏదో దేవినట్లయింది.

"పిన్నీ! పిన్నీ! ఎందుకేడుస్తు న్నావు" అంటూ బాబు వచ్చాడు.

"ఏం లేదు బాబూ!...కంట్లో నలకపడిం దంతే!" అంటూ వాడిని ఒడిలోకి తీసుకొని దుఃఖ మాపు కోడానికి విఫలప్రయత్నం చేసింది ఆమె.

ఓ నిశ్చయానికి వచ్చినవాడిలా శేఖరం అన్నాడు "మీరు నన్నెందు కిలా మభ్యపెడుతున్నారో నా కర్థం కావటంలేదు. బాబు పిల్చిన పిలుపునుబట్టి ఆమాత్రం అర్థం చేసుకో లేనా? అసలు మీ అభిప్రాయం ఏమిటి?"

"అదికాదు డాక్టర్! వీడు నా కొడుకే! భవిష్యత్తుకి అటంకం రాకుండా మా అమ్మ, అక్కయ్య వాడికలా తర్ఫీదిచ్చారు. నిస్సహా యతతో ఓ దుర్నీతివరుని నమ్మి నందుకు ప్రతిఫలంగా చేసిన పాపాన్ని నిత్యం గుర్తుకుచేస్తూ తన మాటలతో మరింతగా మనస్సును పిప్పిచేస్తున్న నిర్భాగ్యుడు వీడు. నా గుండెల పంటకాదు ... నా మన స్సులో రగిలే మంటకి ప్రతిరూప మిది!"

"ఈ అమృత కలశాన్ని కాల దన్నుకొన్న ఆ మూర్ఖుడే మయ్యాడు?"

పొంగివస్తున్న కన్నీళ్ళను ఆపు కుంటున్నది ఆమె. "తెలియదు. పెళ్ళాడతానని నమ్మించి ఫలితం విన్నవెంటనే పరారీఅయ్యాడు. అత నిదికాదు మూర్ఖత! ఊళ్ళో తలెత్తు

కోలేక నాన్నగారు ఆ ఊరునుండి మకాము ఎత్తివేశారు. మేమీ వూరువచ్చి నాలుగేళ్ళయింది. పెళ్ళయిన కొద్దిరోజులకే పెద్దకూతురు వితంతువుఅయింది. కాలేజీలో చదివే చిన్నకూతురు దారితప్పి మోసపోయింది. పుట్టిన పిల్లలిద్దరూ ఇలా అయిపోతే ఆ తండ్రి హృదయం ఎంతక్షోభిస్తుంది? అదే వ్యథ ఆయన శక్తిని పీల్చి పిప్పిచేసి ఆఖరికి ప్రాణాలు తీసింది. ఆయనపోయి రెండేళ్ళయింది. వ్యథా భరితమైన మా జీవితాలు, మోడువారిన మేమూ మిగిలాము. మాలో... మా బ్రతుకులో, మా చుట్టూ... అంతా చీకటి. కటిక చీకటి ... ఎప్పటికీ వెలుగురాని చీకటి. అంతే డాక్టర్! అంతే...'

పదినిమిషాలవరకు ఎవరి నోటి వెంట మాటలేదు. శేఖరం మనస్సు కలగిపోయింది.

ఓసారి కళ్ళు తుడుచుకొని హిమబిందు అన్నది 'మీ కీ హీన చరిత్ర చెప్పకూడదనే అనుకున్నాను. నాపై మీకుండే సదభిప్రాయాన్ని పోగొట్టుకోకూడదనుకున్నాను. కాని, మీరు పట్టుపట్టారు. నేను చెప్పక తప్పలేదు. ఇప్పటికయినా నాకు మీముందు నిలబడే అర్హత లేదని మీరు గ్రహించి ఉంటారు. ఈ పాపాత్ములాలు మిమ్మల్ని ఏ విధంగానైనా ఆశపెట్టివుంటే క్షమించండి డాక్టర్! క్షమించండి... సెలవు' అని అతనికి చేతులు జోడించి పైకి లేచింది ఆమె.

'బిందూ!...' ఒక్క కేకతో ఆమె చేతిని పట్టుకొని తనవైపు లాక్కున్నాడు శేఖరం. ఆమె తెల్లబోయింది. అతని కళ్ళలోని విచిత్రమైన కాంతి ఆమెను చకితురాల్ని చేసింది.

'వీల్లేదు. నిన్నెప్పటికీ ఒంటరిదాన్ని చేయను... క్షమించు—ఏకవచనం ప్రయోగిస్తున్నందుకు. ఇన్నేళ్ళకు నా మనస్సుకు నచ్చిన వ్యక్తి నాకు దొరికిందనుకున్నాను. నీ కథ విన్నాక కూడా నా అభిప్రాయం మారలేదు. ఇది ముమ్మాటికీ నిజం ... ... భగవత్సాక్షిగా...'


'ఆవేశపడకండి. మీ పవిత్రమైనజీవితంలోకి పతితనెందుకు చేర్చుకుంటారు? తెలిసి ఈ ఎంగిలి బ్రతుకులోకి మిమ్మల్నెలా ఆహ్వానించను?...'

'అగ్నిలో తుప్పుపట్టిన ఇనుము పడవేస్తే ఆ ఇనుమే శుద్ధ అవుతుంది కాని ఆ అగ్నికేమీ అంటదు. నిన్ను వదులుకున్నవాడు నిర్భాగ్యుడు కాని... నువ్వు కాదు. కలలోకూడా నీలో దోషాన్ని చూడలేను నేను...'

'...మీరు పొరబడుతున్నారు. దూరం ఆలోచించండి. వీడు నా కొడుకు...'

'నన్ను నీవు అనుగ్రహిస్తే నా కొడుకవుతాడు.'

అతని మధుర మందహాసం ఆమెను పిచ్చిదాన్ని చేసింది. '...నన్ను ఆలోచించుకోనీయండి. నా మూలంగా మీరు...'




"...అదృష్టవంతుడి నవుతాను. ఆలోచించుకో. గంటలు, రోజులు, నెలలు... ఎంతకాలమైనా సరే... నన్ను నీ వాడిని చేసుకో! అంతే... బిందూ! అదే నాకు కావాలి .."

ఆమె మూగదయి పోయింది... బాబు నెత్తుకొని ఆమె మందగమనంతో వెళ్ళిపోతుంటే అలాగే ఆర్ద్ర నయనాలతో నిలబడిపోయాడు రాజశేఖరం! అతని కెంతో రిలీఫ్‌గా ఉంది. తన అన్నావదినల అనుమతి తనకెప్పుడూ ఉంటుందన్న విశ్వాసం అతని మనోనిశ్చయానికి పెట్టని కోటలా నిలబడింది.

* * *

ఆ తర్వాత ఒకనాడు హిమబిందు ఒంటరిగా వచ్చింది. ఆమె భావం గ్రహించి, 'అలా మా బంగళా దాకా వెడదాం నడు. ఎన్నిసార్లు రమ్మన్నా వాయిదా వేశావు' అన్నాడు శేఖరం ఆప్యాయంగా.

ఏవో కబుర్లతో నడక సాగించాడు అతను. ఆమె ఊకొడుతూ అనుసరించింది. పదినిమిషాల్లో బంగళాని చేరుకున్నారు.

బంగళాచుట్టూ పూలమొక్కలు, క్రోటన్సు... అంతా కన్నుల పండువగా ఉంది. మల్లె పందిరి క్రింద కుర్చీలలో ఆసీనులయ్యారు ఇద్దరూ.

హిమబిందు మనస్సునేదో ప్రశాంతత ఆవరించింది.

వంటవాడు మైసూరుపాకు, కాఫీ ట్రేలో పెట్టి తెచ్చాడు.

"ప్లీజ్!... నాకేం తినాలని లేదు."

"నాకోసం."

"అవును. మీకోసం... ఏం చేయటానికైనా సరే సిద్ధపడే వచ్చాను."

"అదృష్టవంతుడిని."

"కాదు. అదృష్టం నాది."

"పోనీ, ఇద్దరిదీను" అతని మంద హాసంతో శ్రుతికలుపలేక పోయింది ఆమె.

ఫలహారం పూర్తయిందని పించింది ఆమె. "ఇక్కడెవరూ లేరు కదా!"

"ఉహుఁ! నేను, వంటవాడు. అంతే! తోటమాలి వెళ్ళిపోయాడు. నీవు అంగీకరిస్తే ఇక నా అన్నావదినలువచ్చి మనల్ని దీవించటమే తరువాయి..." అతని కళ్ళల్లో, ఎన్నో ఆశాజ్యోతులు! ఆమె హృదయంలో ప్రళయ తాండవ జ్వాలలు! మధ్య అనే లోయ కిరువైపులా రెండు ప్రాణులు - ఒకేవైపుకు రావాలన్న ప్రాకులాట!

"మీరు నాకొక మాట ఇవ్వ గలరా?"

"నేనే నీ వాడిని కాబోతున్నప్పుడు నీకింకా సందేహాలెందుకు బిందూ!"

గుండెల్ని చిక్కబట్టుకుంటూ అన్నది ఆమె. "ఈ ఆనందం భరించటానికిముందు నా బాధ్యత మరి కొకటిఉంది..."

"నీకోసం... నీ ఆనందంకోసం ఎంత బరువైన బాధ్యతైనాసరే నేను వహిస్తాను... సహిస్తాను."

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "పాపిష్టిదాన్ని. నా మాటలతో మిమ్మల్ని కష్టపెడ్తున్నాను. మీరు నా కోరికవింటే..."

ఆమె చేతిశ్రేళ్ళను నిమురుతూ అన్నాడు శేఖరం. "ఎంత కష్టమయినదయినా- భరించటానికి సిద్ధంగా ఉన్నాను బిందూ! నీకోసం వ్యథను భరించటం కూడా ఓ అదృష్టం..." అతని కంఠంలోని ఆవేశం ఆమెను కరగించి కన్నీటిగా పారించింది.

ఓ నిమిషం ఆగి కళ్ళు తుడుచుకొని తన హేండ్ బేగ్ లోంచి ఓ ఫొటో తీసి అతని చేతి కందించింది హిమబిందు. తెల్లబోతూ అది తీసుకున్నాడు అతను.

నవయౌవన విలాసిని, సుహాసిని సుకేశిని.. నుదుట తిలకం, కాటుక కళ్ళమధ్య కాంతు లీనుతోంది—పోలికను బట్టి ఆమె హిమబిందు సోదరి అని గుర్తించాడు శేఖరం. పెళ్ళికి ముందు ఫొటో కావచ్చు!

అది తనకు చూపించటంలో హిమబిందు ఉద్దేశం అర్థం కాలేదతనికి. అతను తలెత్తి చూసేసరికి "అక్కయ్య సుశీల!" అన్నది ఆమె.

"గుర్తించాను. కాని..."

"...దురదృష్టంకొద్దీ నెలరోజుల

వైవాహికజీవితం అలా ముగిసి పోయింది కాని... సుగుణాలరాశి — తన కేంకావాలో తెలుసుకోలేని అమాయక ఆమె.'

'ఇదంతా నాకెందుకు చెప్తున్నావో...'

'...వినండి. ఆమెకంటె చిన్నదాన్నయినా... ఆమెకు మళ్ళా పెళ్ళి చేయవలసిన బాధ్యత నా మీద ఉంది. మా నాన్నగారి కిచ్చిన మాట నేను నెరవేర్చుకోవాలి.'

'అంటే...'

'మీరు వహించవల్సిన బాధ్యత ఇదే శేఖర్‌బాబూ! మీరు అక్కయ్యని పెళ్ళిచేసుకోవాలి. మా జీవితాలకు వెలుగు చూపించాలి...'

'బిందూ!...' వెర్రిగా కేక పెట్టాడు రాజశేఖరం. '...ఏమిటి నువ్వనేది? ఎందుకిలా నన్ను పరిహసిస్తున్నావు?'

'పరిహాసం కాదు. ప్రార్థన! మా జీవితాల్లో వెలుగు ప్రసాదించమని అభ్యర్థన!...'

శేఖరం ముఖం వివర్ణమయింది. బాధతో మెలికలు తిరిగిపోయాడు.

'నన్నింత క్లిష్టసమస్యలో పడవేస్తావని నేనెప్పుడూ అనుకోలేదు బిందూ! ... ఈబాధ భరించలేను బిందూ! నిన్ను వదులుకొని ఎలా బ్రతుకను? ... నన్నెందుకిలా కట్టేశావు?' అంటూ ముందున్న బల్ల మీద చేతుల్లో తలవాల్చేసుకున్నాడు అతను.

లావాను బయటకు పోనిచ్చిన అగ్నిపర్వతం కొంతసేపటికి చల్లారుతుంది!

హిమబిందు దృఢచిత్తురాలైంది. నెమ్మదిగా అతని జుట్టులోకి తన వ్రేళ్ళు పోనిచ్చి నిమురుతూ అన్నది. 'శేఖర్‌బాబూ! మీ బాధ నాకు తెలుసు. ఓ పతితను మీ జీవితంలోకి నిస్సంశయంగా అడుగుపెట్టనివ్వగల మీ ధీరచిత్తం మరో కవితంతువును అదృష్టవంతురాల్ని చేయటానికి సందేహించలేదు. ఇక పోతే, మీరు కోరుకున్న దానికి విరుద్ధంగా జరగటానికి నా బాధ్యత తప్ప వేరే కారణమేమీలేదు. అక్కయ్యకు మీ సహృదయంలో చోటు దక్కుతుందనే నా ఆశ. ఆపైన మీరే నా సంరక్షకులయినప్పుడు నేనెప్పటికీ మీ మాటకు కట్టుబడి ఉంటాను. నేనెప్పటికీ మీదాన్ని. నా హృదయం విప్పి మీముందు ఉంచాను. ఆపై మీయిష్టం... నా అదృష్టం!...'

'బిందూ!...' గద్గదస్వరంతో తల ఎత్తాడు శేఖరం. అతని బుగ్గల నిండా కన్నీటిధారలు చూసి ఉలిక్కిపడింది హిమబిందు. ఆమె వికల మనస్కయైంది.

'అయ్యో!... మిమ్మల్నీవిధంగా హింసిస్తున్నానా? నన్ను క్షమించండి శేఖర్! మీరిలా బాధపడటం నేను సహించలేను. నాదేతప్పు! నా అక్కయ్యకోసం నేను త్యాగం చేయటంలో అర్థంఉంది. మీరు పరాయి వ్యక్తికోసం...'

'ఆగు ... బిందూ! ఆగు. ఇంకేం చెప్పకు. నాగుండెల నిలా చీల్చకు. నువ్వు నాకు పరాయివ్యక్తివి కావు. నువ్వు నాలో జీవానివి. ప్రాణానివి. నీకోసం ఈ గుండెలలో ఆఖరి స్పందన కూడ మిగిలి ఉంటుంది బిందూ! నామాటు నమ్ము ...' అతని చేతివ్రేళ్ళమధ్య ఆమె కరతలం మృదువుగా నలిగిపోయింది.

'మీ త్యాగంతో పోలిస్తే నేనే పాటిదానను? ...' ఆమె కనులార్ద్రిత చెందాయి.

'తప్పు. అలా అనకు. అది త్యాగంకాదు. ధర్మం ... నిజం బిందూ!'

'మీరు పూర్ణ పురుషులు. ఇది



నా భాగ్యం!' అతని చేతులు కళ్ళ కద్దుకొని లేచి నిలబడింది హిమబిందు. 'పోయిరానా శేఖర్!... రేపు మీకోసం మాయింట్లో అంతా ఎదురుచూస్తుంటాము.'

బాధను నిగ్రహించుకుంటున్న అతని ముఖంలో నరాలు పొంగాయి. మౌనంగా తల పంకించా డతను.

ఆమె వెనుదిరుగబోతుంటే చేయి పట్టుకొని ఆపుచేశాడు అతను. 'బిందూ! గంటక్రితం వరకు నీలో ప్రేయసిని, స్త్రీత్వాన్ని చూసి ముగ్ధుడనయిన నేను ... ఇప్పుడు నీలోని దివ్య త్యాగానికి అప్రతిభుడి నవుతున్నాను. చేతికందిన వస్తువును ఎంత ప్రీతికరమయిన దయినా సానుభూతితో మరొకరికి త్యాగంచేయగలవిశాల హృదయం నీకు దివ్యత్వాన్ని ప్రసాదిస్తోంది. నీ జీవితంలో ఏమచ్చ ఏర్పడినా అదంతా భ్రమ!– నీక్షేమంకోసం, నీ ఆనందం కోసంనే నను క్షణం పాటుపడతాను. మనస్సులో ఇంకేమీ పెట్టుకోకు... రేపు నేను మీయింటికి తప్పకుండా వస్తాను...'

ఆనందబాష్పాలతో ఆమె అతని పాదాలపై వాలిపోయింది. గబుక్కున ఆమె భుజాలు పట్టుకొని లేవదీశాడు శేఖరం. 'నీస్థానం అక్కడకాదు, ఇక్కడ' అని తన గుండెలవైపు చూపించాడు అతను. ఆమె అతని గుండెలపై వాలిపోయింది. ఆమెను పొదివి పట్టుకొని ఆమె కవోష్ణబాష్పధారలని తన పెదవులతో తుడిచివేశాడు అతను.

♦ ♦ ♦

ఆ మరునాటి సాయంత్రం స్వాతివాన కురిసింది. ముత్యపుచిప్పలు పరవశించాయి!

'అక్కా! వారే రాజశేఖర్...'

> పిల్లవానికి పాలు మాన్పింప దలచి
> అలదుకొన్నది చేదును పొలతి, ప్రణయ
> వేళ, దంతక్షతమునందు వెల్లబాఱు
> పతినిగని కిలకిలమని పడతి యనియె;
> 'కాపురాన కష్టాలును కలవులెండి'.
>
> — శివరామకృష్ణమూర్తి

అంటూ హిమబిందు పరిచయం చేసింది.

సుశీల నమస్కృతికి ప్రత్యభివాదం చేశాడతను.

'కూర్చొని మాట్లాడుతూండండి. ఇప్పుడే వస్తాను' అని హిమబిందు నిష్క్రమించింది.

ఒక్కసారి తన సోగకళ్ళనెత్తి శేఖరంవైపు చూసి తలదించుకున్నది సుశీల. ఆమె నుదుటిపై అరుణ తిలకం మెరుస్తోంది. ఫొటోలో

కంటె అందంగా ఉన్నది ఆమె. కాని కళ్ళక్రింద కనీ కనిపించని నలుపు వ్యథను వెలికి చూపుతోంది. ఆ భంగిమలో ఏదో గాంభీర్యం, తపస్సు ఉన్నాయి. హిమబిందు వారి నొంటరిగా వదలి వెళ్ళటంలోని ఉద్దేశ్యం ఇద్దరికీ తెలుసు.

ఆఖరికి శేఖరం మౌనభంగం చేశాడు.

'మీ ఇంట్లో ఇప్పుడు కులాసాగా ఉందా ?'

'ఆ!'

'చూడండి. సుశీలాదేవీ! మీ గురించి బిందు పూర్తిగా చెప్పింది. ఇకనాగురించి మీ కేమైనా సందేహాలుంటే అడుగవచ్చు'

ఆమె విస్ఫారిత నేత్రాలతో అతన్నొకసారి పరికించింది. ఆ కన్నులలో కాంతి, ఆ ముఖంలో గంభీరత, ఆ కంఠంలో మాధుర్యం ... అతని వ్యక్తిత్వంలో ఏదో ఔన్నత్యం ఉంది! ఆమె మెల్లగా అన్నది '...మీ గురించీ బిందు నాకన్నీ చెప్పింది. నా కెటువంటి సందేహాలు లేవు. కాని, మీ పవిత్ర జీవితంలో నేనొక అపశ్రుతిలా ...'

'... తప్పు. మీరలా అనకూడదు. నేనంత ఆత్మనిందను భరించలేను. మీకు ఆత్మవిశ్వాసం కావాలి. నేను కోరుకునే దదే!'

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. '... నేనీ అదృష్టాన్ని భరించలేనేమోనని భయంగా ఉంది'

'...మా అక్కయ్య ఉత్తపిచ్చిది శేఖర్...' అంటూ నవ్వుతూ ట్రేలోని కాఫీ, టిఫిను టీపాయ్‌మీద పెట్టింది హిమబిందు.

'అమ్మా!...' అంటూ ఒక్క పరుగులో వచ్చి సుశీల ఒడిలో వాలిపోయాడు బాబు.

అప్పచెల్లెళ్ళిద్దరూ ఉలిక్కిపడ్డారు. అయితే కారణాలు వేరు.

'...అక్కయ్య దగ్గర వాడి కెక్కువ అలవాటు...' బలవంతంగా నవ్వింది హిమబిందు. '...బాబూ! అదిగో ఐసుఫ్రూటువాడు వచ్చాడు' అంటూ వాడిని మాయచేసి సుశీల చేతుల్లోంచి లాక్కుని ఆమె వడివడిగా బయటకు తీసుకొనిపోయింది.

కొంతసేపటివరకు సుశీలముఖం లోకి అయోమయంగా చూస్తుండిపోయాడు శేఖరం!

'అలా అంటుందికాని, వాడికి పిన్నిదగ్గరే ఎక్కువ అలవాటు...'

శేఖరం ప్రశ్నార్థకంగా చూశాడు కాని, ఎవరికీ మాటలు దొరకలేదు— యాంత్రికంగా టిఫిను తిని కాఫీ త్రాగారు ఇద్దరూ.

సుశీలలోని ఉత్సాహం ఏదో నివురుగప్పిన నిప్పులా ఉంది!

'ఇక పోయిరానా మరి ?' అంటూ లేచాడతను.

ముసలావిడ తలుపుచాటునుంచి అన్నది 'మీ మేలు మా జన్మలో మర్చిపోలేము నాయనా! చిన్నవాడవయినా చేయెత్తి...'

'...అంతమాటనకండమ్మా! నే




నిందులో చేసిందేమీ లేదు. ఓ విధంగా చెప్పాలంటే నాలో ఏమాత్రమయినా మంచి అనేది ఉంటే అది మీ హిమబిందు పరిచయప్రభావం. అంతే! ... ఇక సెలవు తీసుకుంటాను ఈవేళే మా అన్నయ్యకి ఉత్తరం వ్రాస్తాను ...'

'మంచిదిబాబూ!'

◆ ◆ ◆

ఉదయమే తయారయి హాస్పిటలుకని బయలుదేరబోతున్న డాక్టరు రాజశేఖరం అంతప్రొద్దుటే ఉరుకు పరుగులమీద వచ్చిన హిమబిందును - ఏదో బాధతో కంపించిపోతున్న ఆమె తనూలతను చూసి నిర్ఘాంతపోయాడు.

'బిందూ!—ఏంజరిగింది?'

కుర్చీలో కూలబడి చేతుల్లో ముఖాన్ని దాచుకొని వెక్కి వెక్కి ఏడువసాగింది ఆమె. ఏమీ అర్థం కాక అతను పిచ్చివాడిలా కొంతసేపటివరకు చూస్తుండిపోయాడు.

ఆమె బాధనిక చూడలేక దగ్గరగా వెళ్ళి ఆమెను, తన బాహువుల మధ్య పొదివి పట్టుకొని తల నిమురుతూ అన్నాడు 'ఎందుకిలా క్రుంగిపోతున్నావు బిందూ? నీబాధ నాతో చెప్పవూ? నీవిలా గుండెలు పగిలేలా దుఃఖించటం నేను చూడలేను. చెప్పు బిందూ! ఏంజరిగిందో చెప్పు!...'

అతని అనునయంతో కొంత

శాంతించిన హిమబిందు తన జాకెట్లోంచి తీసి ఒక కాగితం మడతను వణికే చేతులతో అతని కందిస్తూ అన్నది. "ఈ నిర్భాగ్యురాలికిక అక్కయ్య కనపడదు."

ఉలిక్కిపడ్డాడతను. కంగారుగా ఆ కాగితం మడత విప్పి చదవ సాగాడు.

అది సుశీల శేఖరానికి వ్రాసిన లేఖ!

"శేఖర్‌బాబూ!

మీరు నన్ను వివాహం చేసుకోటానికి అంగీకరించారంటే అది మీ గొప్పతనం! నా భాగ్యం! కాని, ఈ భాగ్యాన్ని కాదని పోతున్నా నంటే మీ కాశ్చర్యం కలుగవచ్చు- నాపని పిచ్చితనంగా కనపడవచ్చు- అయితే, నిజం నేరు.

బిందూని క్షమించండి. ఆమె మిమ్మల్ని మోసగించింది. తన అందచందాలు, ఉత్తమ సంస్కారము చూసి ఆకర్షింపబడిన ప్రతి పురుషుని ఆమె మోసగించింది ... బాబు తన బిడ్డడని చెప్పి! అందుకు సిద్ధమై వచ్చినవాళ్ళను వితంతువునైన నన్ను పెళ్ళాడమని ప్రార్థించింది. ఒక పతిత నాదరించగల సహృదయుడు ఒక వితంతువును తప్పక స్వీకరించగలడని ఆ పిచ్చిపిల్ల ఊహ!

అందుకనే నామీద మీకు సద్భావం, సానుభూతి కలగటం కోసం మీ విశాల దృక్పథం తెలిసి కూడా బిందూ మిమ్మల్ని మభ్య పెట్టింది. తానే బాబు కన్నతల్లినని నమ్మించాలని ఎంతో చేసింది. అదంతా మీయందుశంకవల్ల కాదు- దక్కబోతున్న అదృష్టం నాచేయి జారిపోతుందేమోనని.

కాని, ఆ వితంతువును-పతితను నేనే శేఖర్‌బాబూ! ఒక స్వార్థపరుని మాటలు నమ్మి భంగపడింది నేనే! ఏ అక్క సుఖంకోసం ఈ నిందనంతా తాను మోయాలని బిందూ సర్వవిధాల ప్రయత్నించిందో అవ్యక్తిలో మచ్చుమిగిలినా మమకారం అంతరించలేదు శేఖర్‌బాబూ!

స్ఫటికంలా నిర్మలమైనది ... పాలల్లా స్వచ్ఛమైనది, హిమబిందువులా పవిత్రమైనది నా సహోదరి హిమబిందు! నాకోసం తన చదువు మానుకుంది. నాకోసం ఏ స్త్రీ భరించలేని నిందను మోసింది. నా సుఖంకోసం సర్వవిధాల ప్రయత్నించింది. ఆఖరికి నాకోసం తనకు మనసిచ్చిన వ్యక్తినే అర్పించటానికి సిద్ధమయింది! పిచ్చిపిల్ల! నాకేమీ తెలియదనుకొంది. నాకు చెప్పవద్దని అమ్మతో చాటుగా అన్ని వివరాలు చెప్పింది. నేను విన్నానని వాళ్ళకు తెలియదు!

నేను పొంగిపోయాను. నా గుండెలు ఆనందంతో బ్రద్దలయి పోయాయి ... ఇటువంటి భాగ్యం నాకు దక్కినందుకు కాదు!—తన సర్వస్వాన్ని తృణప్రాయంగా తన అక్క సుఖం కోసం త్యజించగల్గిన చెల్లెల్ని పొందిన అదృష్టానికి!

కాని, ఇప్పటికే నాకోసం తన భవిష్యత్తునే పూర్తిగా విస్మరించింది నాచెల్లెలు. ఆమెను సుఖపెట్టవలసిన బాధ్యతను నేను విస్మరిస్తే నాకిక ఈ జీవితానికి తృప్తి, విలువ ఉంటాయా? నాకు చివరకు మిగిలేది చీకటికాక మరేమిటి?

ఈదివ్వెను వెలిగించిన హస్తాన్నే కాల్చివేయగలనా! నీడనిచ్చిన చెట్టునే నరికివేయగలనా! మీఇద్దరి త్యాగాన్ని ఎలా భరించగలను? అందుకనే నేను దూరంగా వెళ్ళిపోతున్నాను.

మీ సహృదయంలో చోటుచేసుకొన్న నా చెల్లెలు ధన్యురాలు. మీవంటి వ్యక్తి రాకకోసమే నేనిన్నేళ్ళు నిరీక్షించాను. లేకపోతే, నేను బిందును విడిచి ఎప్పుడో వెళ్ళిపోవల్సిన దాన్ని.

అలాగని బ్రతుకుమీద విరక్తి చేత ననుకోకండి. ఆత్మహత్య చేసుకునేటంతటి బలహీనురాల్ని కాను. జీవితమంటే జీవించటానికే అన్న సత్యాం నాలో పాదుకొల్పిన దేవత హిమబిందు!

నా వియోగం నా బాబును బాధించదనే నా ఊహ. వాడికి మీరే తల్లిదండ్రులు కాగలిగినప్పుడు నాకేభయమూ ఉండదు. అమ్మకి మీరే ధైర్యం చెప్పాలి. చెల్లాయిని మీరే ఓదార్చాలి. బాబుని మీరే చేరదీయాలి. వీరందరి బాధ్యత మీకు వదలివెడుతున్నాను. ఇప్పుడు నాకు తృప్తిగా ఉంది.

ఎక్కడఉన్నా మీ హృదయాలకు చేరువనే ఉంటాను. మీకోసమని బిందూ నానుదుట దిద్దిన తిలకం నాకు సౌభాగ్యాన్ని ప్రసాదించింది. ఆ అదృష్టమే నన్ను కాపాడుతుంది. మీరెవరూ దిగులు పడవద్దు. ఈ అన్వేషణలో ఒకనాటి శుభఘడియకోసం నేను ఎదురు చూస్తుంటాను.

మీ అమృత హృదయానికి జోహారులర్పిస్తూ—

సుశీల.

టపటపమని అశ్రుబిందువులు రాలి ఆ లేఖ తడిసిపోయింది. అద్వితీయమైన గగుర్పాటేదో అతన్ని కదలించివేసింది. ఆ భావనావేశంలో హిమబిందు తనూలతను తన గుండెలకు హత్తుకున్నాడు రాజశేఖరం! ఆ హృదయ విపంచికలు మధుర శ్రుతులు చేసుకున్నాయి.

ఆమె వినీల కుంతలాలపై అతని అశ్రుబిందువులు దీవెనలై వర్షించాయి!

□□□